క్లుప్తంగా

నేడు సర్పంచులకు పురస్కారాల ప్రదానం

కొత్తూరు: నేడు(గురువారం) మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేకంగా గ్రామాలను అభివృద్ధి చేసిన సర్పంచులకు అవార్డులను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఆయా శాఖలకు చెందిన అధికారులు మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, విద్య, పలు అంశాల్లో ముందున్న పంచాయతీలను గుర్తించి పురస్కారాలకు ఎంపిక చేసినట్లు వివరించారు. ఎంపిక చేసిన పంచాయతీలకు అధికారులు అవార్డులను ప్రకటించనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

పెద్దఎల్కిచర్లలో బంతి ఆట



బంతి ఆట ఆడుతున్న గ్రామస్తులు

కొందుర్గు: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దల్కిచర్లలో బంతి ఆట ఆడటం ప్రత్యేకత చాటుకుంది. చింతగింజలు, గోనెసంచులతో తయారు చేసిన బంతి ఈ ఆటలో ఉపయోగిస్తారు. గ్రామం ముఖ్యకూడలిలో చిన్న పెద్ద తారతమ్యం లేకుండా ఈ ఆటలో పాల్గొంటారు. మధ్యలో రెండు వైపులా రాళ్లను ఉంచి వాటిపై కర్రను ఉంచుతారు. ఆటలో పాల్గొన్న వారంతా రెండు జట్లుగా విడిపోయి ఈ కర్రను కొడుతారు. తమ గ్రామంలో ఈ ఆట తాతల కాలం నుంచి ఆనవాయితీగా వచ్చిందని స్థానికులు అంటున్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



రేవంత్‌రెడ్డితో షాద్‌నగర్ కాంగ్రెస్ నేతలు

షాద్‌నగర్: తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని బుధవారం షాద్‌నగర్ కాంగ్రెస్ నేతలు కలిశారు. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, దేవేందర్, లింగారెడ్డిగూడ అశోక్ తదితరులు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం రేవంత్ రెడ్డిని కలిసి కండువా కప్పి సన్మానించారు.

శాలివాహన చక్రవర్తికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కుమ్మరి సంఘం నాయకులు

షాద్‌నగర్‌టౌన్: శాలివాహన చక్రవర్తి జయంతి వేడుకలను బుధవారం షాద్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రాఘవేంద్రలాడ్జి ఆవరణలో నియోజకవర్గ కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో శాలివాహన చక్రవర్తి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీశైలం, సంఘం నాయకులు నర్సింలు, రమేష్, వెంకటేష్, శ్రీను, కృష్ణ, జంగయ్య, అంజయ్య, సాయిలు, బాల్‌రాజ్, వెంకటయ్య పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఉగాది శుభాకాంక్షలు



చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నేతలు

మొయినాబాద్: మాజీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడికి టీడీపీ నాయకులు శోభకృత్ నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది సందర్భంగా బుధవారం మొయినాబాద్ మండలానికి చెందిన టీడీపీ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి కొమ్మిడి వెంకట్‌రెడ్డి నగరంలో చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, టీడీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎన్‌టీఆర్ ట్రస్ట్ భవన్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు ఉన్నారు.



కేశంపేట: పంచాంగ శ్రావణంలో పాల్గొన్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



చందనవెల్లిలో పంచాంగ శ్రవణం వినిపిస్తున్న పండితులు, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి

ఊరూరా ఉగాది సంబరాలు

తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను బుధవారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఇళ్లను మామిడి తోరణాలతో అలంకరించి, మట్టి కుండల్లో షడ్రుచులతో కూడిన పచ్చడిని చేసి దేవాలయాలకు సమర్పించి అనంతరం ఆరగించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని దేవాలయాలను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల ఆధ్వర్యంలో శోభకృత్ నామ సంవత్సర నూతన పంచాంగ శ్రావణం చదివి వినిపించారు. కొత్త సంవత్సరం అందరు బాగుండాలని, పాడిపంటలు, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయని పూజారులు తెలిపారు. ఉగాదిని పురస్కరించుకొని రైతులు గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పరమన్న భక్షాలను తినిపించారు. పంచాంగ పఠనంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



షాద్‌నగర్‌రూరల్: హిందూధర్మం భక్తి ఛానల్ పంచాంగం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే



చేవెళ్ల: పంచాంగ శ్రావణం వింటున్న గ్రామస్తులు, నాయకులు



షాబాద్ : పంచాంగం వినిపిస్తున్న రమేష్ పండితులు,పెంటయ్య



కొందుర్గు: పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు



మొయినాబాద్‌రూరల్: గోమాతకు భక్షాలు తినిపిస్తున్న భక్తులు



శంకర్‌పల్లి: అయ్యప్పరెడ్డిగూడ హనుమాన్ దేవాలయంలో..



నందిగామ: పంచాంగాన్ని చదివి వినిపిస్తున్న పూజారి

నేడు మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశం

కేశంపేట: నేడు మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఉదయం 11గంటలకు ఎంపీపీ ఎల్లనమోని రవీందర్ యాదవ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బీపీడీపీ, జాతీయ పంచాయతీరాజ్ అవార్డులకు ఎంపికైన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రేపు భగత్‌సింగ్ వర్ధంతి సభ



వర్ధంతి సభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

చేవెళ్ల: 23న భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌సింగ్‌ల 92వ వర్ధంతులను జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజేశ్ పేర్కొన్నారు. చేవెళ్లలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం ఎస్సీ బాలురు వసతిగృహంలో భగత్‌సింగ్ 92వ వర్ధంతి సభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో జరుగుతున్న మతవిద్వేష, ఉన్మాదదాడులకు వ్యతిరేకంగా వర్ధంతి కార్యక్రమాలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. వలస పాలకుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి 23 ఏళ్ల వయస్సులోనే ఉరికొయ్యలపై ఉయాలలూగిన వీరుడు భగత్‌సింగ్‌ని కొనియాడారు. చెరసాలలను హేలన చేసి అమరత్వం పొందిన వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు నేటి తరానికి స్ఫూర్తి ప్రదాతలన్నారు. సమాజాన్ని పీడిస్తున్న రుగ్మతల్లో మతం ఒక్కటి అంటూ మతంపై భగత్‌సింగ్ స్పష్టమైన వైఖరితో పోరాడినట్లు తెలిపారు. మతతత్వ శక్తుల పన్నాగాలను, అభివృద్ధి నిరోధకులను తిప్పికొట్టేందుకు నేటి విద్యార్థి, యువతరం ముందుకు రావాలని జరిపే భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు సురేశ్, శ్రీకాంత్, గోపాల్, విద్యార్థులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

సర్పంచ్ నరేందర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కిషన్

షాబాద్: విద్యార్థులు సేవ కార్యక్రమాల్లో ముందుండాలని మద్దూర్ గ్రామ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, టీజీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.హెచ్. కిషన్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో విద్యార్థులు పరిసరాల పరిశ్రభతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక సమస్యల పరిష్కారానికి విద్యార్థులు, యువత నడుంబిగించాలన్నారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో ముందుకు సాగాలని చెప్పారు. దేశాభివృద్ధి యువత భుజ స్కంధాలపై ఉందని పేర్కొన్నారు. కళాశాల విద్యార్థులు గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి సర్వే చేయడం అభినందనీయమన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి, చెత్తను తొలగించినట్లు తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు చేస్తున్న శ్రమదానాన్ని ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు , గ్రామస్తులు తదితరులున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్ మాదిగ

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ నెల 31న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాలను బుధవారం మున్సిపాలిటీలోని సోలీపూర్ గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలరాజ్ మాదిగ మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లు గడుస్తున్నా ఎస్సీ వర్గీకరణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. అలాగే, మహిళా బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని, నూతన పార్లమెంట్ భవానానికి అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరంగా ఎస్సీ ఉపకులాలను వర్గీకరించి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. వర్గీకరణ కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా పట్టించుకోకపోవడం సరికాదని వాపోయారు. డిమాండ్ల సాధనకు చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జంగయ్య, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, శ్రీనివాస్, ఆయూబ్, గంగారం, భీంరాజ్, జంగయ్య పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని పెద్దవేడు గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెద్దవేడు తండాలో హనుమాన్ దేవాలయం పునర్నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలన్నారు. మారుమూల గ్రామాల్లో దేవాలయాలు నిర్మించి పూజలు చేస్తే మంచి జరుగుతుందన్నారు. పెద్దవేడు తండాలకు ఇప్పటి వరకూ దేవాలయం లేదు.. ప్రజలందరు పెద్దవేడు గ్రామానికి వచ్చి పూజలు చేసేవారని చెప్పారు. గ్రామస్తుల సహకారంతో హనుమాన్ దేవాలయం త్వరలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, గ్రామస్తులు నర్సింహులుగౌడ్, రఘుపతిరెడ్డి, అశోక్‌కుమార్, యాదయ్య, తండావాసులు కిషన్‌నాయక్, దుస్సూర్ నాయక్, నర్సింహులునాయక్ తదితరులున్నారు.



ఆలయం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్

నేడు బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సమావేశం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ఆలేటి నారాయణసాగర్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 23న కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణ, బీఆర్ఎస్ పథకాల ప్రచారం కల్పించడానికి కార్యాచరణ రూపొందించేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. సమావేశానికి కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యే కోరారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

మాజీ సర్పంచ్ సాత ఆత్మలింగం

శంకర్‌పల్లి: దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని శంకర్‌పల్లి మాజీ సర్పంచ్ సాత ఆత్మలింగం పేర్కొన్నారు. బుధవారం శంకర్‌పల్లి అయ్యప్ప దేవాలయంలో హుండీ లాకర్‌కు శంకర్‌పల్లికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కాశెట్టి చంద్రమోహన్ రూ.4లక్షలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అయ్యప్ప దేవాలయం నిర్మాణానికి పెద్ద ఎత్తున దాతలు ముందుకురావడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, శంకర్‌పల్లి మాజీ ఉప సర్పంచ్ సాత ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు దండు మోహన్, విశ్వేశ్వర్, జంగయ్య, శ్రీనివాస్, పాండు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ఈదమ్మ దేవాలయంలో బుధవారం మండల వడ్డెరసంఘం క్యాలెండర్‌ను ఆ సంఘం అధ్యక్షుడు గండికోట మల్లేశ్ ఆవిష్కరించారు. అంతకుముందు ఈదమ్మ ఆలయంలో ఉగాది పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డేరంగుల వెంకటేశ్, శ్రీనివాస్, గణేశ్, తిరుపతయ్య, రాజశేఖర్, ఈదమయ్య, శ్రీను, వీరయ్య, నర్సింహ, నిరంజన్, సత్యానారాయణ, రామచంద్రి, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఉన్నత చదువులతోనే వృద్ధి



ఎన్ఎస్ఎస్‌పై అవగాహన కల్పిస్తున్న సులోచన, ఉమాయాలాల

సర్పంచ్ సులోచన, ఎన్ఎస్ఎస్ స్పెషల్ ఆఫీసర్ ఉమ

షాబాద్: విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని లింగారెడ్డిగూడ గ్రామ సర్పంచ్ సులోచన, ఎన్ఎస్ఎస్ స్పెషల్ ఆఫీసర్ ఉమ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో బాబుజగ్జీవన్‌రామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నారాయణగూడ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహించారు. డిగ్రీ కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు ఈ క్యాంపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువును మధ్యలో ఆపకుండా ముందుకు సాగాలన్నారు. కరోనా సమయంలో పరిస్థితులు ప్రస్తుత పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి ప్రయోజకులు కావాలన్నారు. విద్యార్థులు సమాజంతో మమేకం చేయడానికి ఇలాంటి క్యాంపులు ఉపయోగపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎల్లేష్, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులున్నారు.

రేపు ఎన్‌పీఏ అవార్డు గ్రహీతలకు సన్మానం

తలకొండపల్లి: నేషనల్ పంచాయతీ అవార్డుల్లో (ఎన్‌పీఏ) భాగంగా 9 అంశాల్లో మొదటి 3 స్థానాల్లో నిలిచిన గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, కార్యదర్శులకు శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తలకొండపల్లి, గౌరిపల్లి, వెంకట్రావ్‌పేట్, చీపునుంతల, చంద్రధన, గట్టుఇప్పలపల్లి, వెల్జాల్, లింగరావుపల్లి, పూల్‌సింగ్‌తండా, గడ్డమీదితండా, ఖానాపూర్, చౌదర్‌పల్లి, వీరన్నపల్లి, చుక్కాపూర్, బల్ల్లులపల్లితండా, జంగారెడ్డిపల్లి, మెదక్‌పల్లి, అంతారం, పాతకోటతండా, దేవుని పడకల్, వెంకటాపూర్ గ్రామ పంచాయతీలు బెస్టు పంచాయతీలుగా నిలిచాయని సర్పంచ్‌లు, కార్యదర్శులకు సన్మానం చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయగలరని కోరారు.

కొత్త జీపీలకు సొంత భవనాలు కరువు

- కనీస వసతులు లేక ఇబ్బందులు
- అసౌకర్యాల మధ్య పాలన

కొత్తూరు: ప్రతి గ్రామానికి పంచాయతీ కార్యాలయమే కీలకం. పాలనకు.. సమస్యల పరిష్కారానికి వేదికగా నిలుస్తోంది. ప్రభుత్వ పథకాలు, పలు కార్యక్రమాలకు లబ్ధిదారులు, ప్రజలు చేరాల్సింది ఇక్కడి నుంచే... కాగా, ఎంతో కీలకమైన పంచాయతీ కార్యాలయాల ఏర్పాటును ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దానికి తోడు అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసింది. వాటికి స్వంత భవనాలు లేకపోవడం.. భవనంలో కనీస వసతులు లేని కారణంగా ప్రజా ప్రతినిధులు, విధులు నిర్వహించే అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొత్తూరు మండలంలో 2011 లెక్కల ప్రకారం 32,145 జనాభా ఉన్నారు.. ఇక్కడ 10 పంచాయతీలు ఉండగా కొత్తగా మరో 4 పంచాయతీలు ఏర్పడ్డాయి.



మక్తగూడలో డ్వాక్రా భవనంలో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం

కార్యాలయాల్లో కనీస సౌకర్యాలు కరువు..

గతేడాది గ్రామాల అభివృద్ధిలో భాగంగా సుమారు 500ల జనాభా ఉన్న అనుబంధ గ్రామాలు, గిరిజన తండాలను పంచాయతీలుగా మార్చింది. వీటితో పాటు 500 మంది జనాభా లేకున్నప్పటికీ ప్రత్యేక అవసరాల దృష్ట్యా మరికొన్ని గ్రామాలు, తండాలను సైతం పంచాయతీలుగా చేసింది. ఏళ్లు గడుస్తున్నా కొత్తగా ఏర్పడిన పంచాయతీలకు చాలా వరకు స్వంత భవనాలు లేవు. కొన్ని చోట్ల అద్దె భవనాలు.. మరికొన్ని చోట్ల ప్రభుత్వ పాఠశాలల అదనపు గదుల్లో.. ఇంకొన్ని చోట్ల ఆయా సంఘాలకు చెందిన కమ్యూనిటీ భవనాల్లో పంచాయతీలు కొనసాగుతున్నాయి. సమావేశాలు, ఇతర కార్యక్రమాలు, పనుల కోసం వచ్చే ప్రజలు కూడా సౌకర్యాలు, వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఇతర భవనాల్లో సాగుతున్న పంచాయతీల వివరాలు

పంచాయతీ గ్రామం	కొనసాగుతున్న భవనం
కొడిచర్లతండా	ప్రభుత్వ పాఠశాల అదనపు గదుల్లో
బైఎంతండా	ప్రభుత్వ పాఠశాల అదనపు గదుల్లో
మక్తగూడ	డ్వాక్రాభవనంలో
మల్లాపూర్‌తండా	అద్దెభవనంలో

భవనం మంజూరు చేయాలి



కొత్తగా ఏర్పడిన పంచాయతీలకు స్వంత భవనాలు మంజూరు చేయాలి ప్రస్తుతం కొనసాగుతున్న కార్యాలయాలు పాలనకు సరిపోవడం లేదు. అంతంత మాత్రంగా సౌకర్యాలు ఉండడంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

– రాజు, సర్పంచ్, మక్తగూడ